ప్రజాశక్తి

గురువారం 30, మార్చి 2023

5

అనంతపురం



మహిళల అభివృద్ధికి కృషి

గుత్తి : పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గుత్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రూఖియా బేగం, సిడిపిఒ అగిశం నాగమణి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతోందన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషణ అందిస్తోందన్నారు. మాతా, శిశు మరణాలు తగ్గుతాయన్నారు. లబ్ధిదారులకు మెరుగైన పోషకాహారం, మంచి ఆరోగ్యం, పరిశుభ్రత, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.నాగేశ్వరి, కృష్ణవేణి, బోధనేతర సిబ్బంది శ్రీలత, మాధవి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రను సస్పెండ్ చేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో కాంటాక్టు, అవుట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను తన సొంత పనులకు వినియోగించుకుంటూ, వారి జీవితాలతో చెలగాటమాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రను సస్పెండ్ చేయాలని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు నాగభూషణం మాట్లాడుతూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్‌కు చెరకు రసం అంగళ్లు ఉన్నాయన్నారు. సోమవారం చెరకు గడలను చెక్కేందుకు కార్మికులను పంపారని తెలిపారు. అందులో కార్మికుడు హెచ్ తిప్పేస్వామి చేతికి కొడవలి తగలడంతో తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవలు అందించాల్సిన పారిశుధ్య కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సొంత పనులకు వినియోగించుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. గతంలో కూడా తన ఇంట్లో పని చేయడానికి కార్మికులను వినియోగించుకున్నారని తెలిపారు. హిందూపురంలో తన సొంత ఇంటి నిర్మాణం చేపడుతున్న సమయంలో రాయదుర్గం మున్సిపాల్టీ కార్మికులను వినియోగించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్‌పై మున్సిపల్ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంలో అంతర్యం ఏమిటని, కార్మికులను తన వ్యాపార సముదాయాలలో పని చేయించుకోవడానికి ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం నుండి కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కమిషనర్‌ను కలిసి విషయాన్ని వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టరును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేసే వరకు కార్మికులు విధులు బహిష్కరించి పోరాటం కొనసాగిస్తారని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ దివాకర్‌రెడ్డి జరిగిన సంఘటనపై విచారణ చేపడతామన్నారు. రవీంద్ర యాదవ్ సస్పెన్షన్‌పై ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు వరలక్ష్మి, నరసమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కుల్లాయప్ప, నరసింహులు, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, బసవరాజు, మల్లేష్, ఆదిలక్ష్మి, సిద్ధిలింగ, రెగ్యులర్ పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం..!

పదోతరగతి వార్షిక పరీక్షల్లో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు దీటుగా వంద శాతం ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు అనంత సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి, తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు చదువుతున్నారో లేదో పరిశీలిస్తున్నారు. అర్థం కాని పాఠ్యాంశాలను ఇంట్లోనే వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడానికి తీసుకున్న చర్యలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

టెన్త్ ఫలితాల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుల కార్యాచరణ

అనంత సంకల్పంతో ముందుకు

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

వంద శాతం ఫలితాల కోసం ప్రణాళిక



హిందూపురం కల్లూరు సుబ్బరావు ఓరియంటల్ స్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ ఏడాది పదిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటిడిఎ పీవో ఆర్.గోపాలక్రిష్ణ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో 57 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. టీచర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు కూడా తమ ప్రతిభకు పదును పెట్టి రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 435 పాఠశాలల్లో 25,881 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. కదిరి ప్రాంతంలో గత ఏడాది జరిగిన సంఘటనల దృష్ట్యా 5 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక నిఘా, సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పది పరీక్షల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఎలాంటి అవంతరాలూ లేకుండా పరీక్షలు పూర్తి చేయాలని నిర్ణయించారు. హిందూపురం పట్టణంలోని అజీజియా పాఠశాల హెచ్‌ఎం పాండు రంగనాయకులు సొంతంగా మోడల్ పేపర్స్ సిద్ధం చేసి, వాటిని డిజిటల్ విధానంలో విద్యార్థులకు వివరిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్ అమలు..

ఐటిడిఎ కార్యాలయం విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని హిందూపురం పట్టణంలోని అజీజియా పాఠశాల హెచ్‌ఎం, సబ్జెక్ట్ టీచర్లు చెబుతున్నారు. ఈ పాఠశాలలో 140 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరుకానున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి టీచర్లు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్, రోజు ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను దగ్గరుండి చదివిస్తున్నారు. వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. డిజిటల్ విధానంలో తరగతులు, మోటివేషన్ క్లాసులు నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను మెరుగుపరుస్తూ మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు.

వంద శాతం ఫలితాలకు చర్యలు..

సమ్మెటివ్, ఫార్మెటివ్ పరీక్షల ఫలితాలు ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. పది పరీక్షల భయాన్ని పోగొట్టి వారిలో మానసిక స్థైర్యం నింపేలా సూచనలు ఇస్తున్నారు. నిపుణులు తయారుచేసిన మాదిరి ప్రశ్న పత్రాలతో సాధన చేయిస్తున్నారు. రోజూ ఉదయం ఒక గంట, రాత్రి రెండు గంటలు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టులకు అసైన్‌మెంట్‌లు ఇవ్వడం, రాయించడం చేస్తున్నారు. డైలీ టెస్ట్‌లను ఏరోజు కారోజు మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రగతిని తెలియజేస్తున్నారు. 57 రోజులు ప్రత్యేక ప్రణాళిక విషయంలో విద్యార్థులు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ..



పాఠశాలలో ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పదవ తరగతి విద్యార్థులను గ్రూపులుగా విభజించాం. మాదిరి ప్రశ్న పత్రాలను సిద్ధం చేసి వాటిపై తగిన శిక్షణ ఇచ్చాం. ప్రతి గ్రూపుకు 10 ప్రశ్నలు ఇచ్చి వాటిని చదివిన అనంతరం టెస్టులు పెట్టి వేరే గ్రూపు విద్యార్థులతో మూల్యాంకనం చేయిస్తున్నాం. దీంతో పోటీ తత్వం పెరిగి విద్యార్థులు బాగా చదివారు. తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఫలితాలతో పాటు, రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధిస్తారన్న నమ్మకం ఉంది.

- అజీజియా హెచ్‌ఎం పాండురంగనాయకులు

ఇంటికెళ్లి సందేహాలు నివృత్తి చేశాం



విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించాం. వారి స్థాయిని బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. రాత్రి వేళల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి సందేహాలను నివృత్తి చేశాం. ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆత్మస్థైర్యం పెంపొందేలా ప్రత్యేక కార్యాచరణ ద్వారా తర్ఫీదు ఇచ్చాం. చాలా మంది విద్యార్థులు మ్యాథ్స్ అంటే భయపడుతారు. దీని కోసం చాలా సులువుగా మాదిరి ప్రశ్న పత్రాలను సిద్ధం చేసి వారికి అర్థమయ్యే విధంగా వివరించాం.

- మ్యాథ్స్ టీచర్ సిద్ధలిగి శ్రీనివాసులు

'అనంత'లో రెండు హత్యలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలో వేరువేరు చోట్ల రెండు హత్యలు జరగడం కలకలం రేపింది. అనంతపురం నగరంలోని ఆజాద్‌నగర్‌లో దూదేకుల సర్దార్‌బీ (57)అనే వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు నులుమి మంగళవారం రాత్రి హత్య చేశారు. హత్య జరిగిన సమయంలో కోడలు సుల్తానా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మంగళవారం రాత్రి దొంగతనానికి వచ్చిన దుండగులు అతన్ని చంపినట్టు కోడలు చెబుతోంది. కానీ ఈ సంఘటనలు పలు అమానాలకు తావిస్తోంది. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మరోవైపు అనంతపురం శివారులో కక్కలపల్లి టమోటా మార్కెట్ వద్ద ఒక వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. శ్రీనివాసులు(40) అనే వ్యక్తిని బండరాయితో కొట్టి చంపిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. శ్రీనివాసులు టమోటా మార్కెట్‌లోని పార్కింగ్ టెండరును దక్కించుకున్నాడు. అయితే ఈ కారణంతోనే హత్య జరిగిందా.. లేక ఇతర కారణాలున్నాయా.. అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఇతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీనిసులుది టిడిపి నాయకుల ప్రేరేపిత హత్య

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కురుబ శ్రీనివాసులు హత్యకు టిడిపి నాయకుల ప్రేరేపితమే కారణమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈమేరకు హత్యకు కారకులను శిక్షించడంతోపాటు ప్రజాశక్తినగర్‌లో రౌడీమూకలను అరికట్టాలని కోరుతూ వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఎస్పీ ఫక్కీరప్పను బుధవారం వినతిపత్రం సమర్పించారు. ముందుగా ముందుగా ప్రభుతాసుపత్రికి వెళ్లి శ్రీనివాసులు భౌతికకాయాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి హత్య జరిగిన ప్రదేశానికి వెళ్లారు. తర్వాత కక్కలపల్లికి వెళ్లి శ్రీనివాసులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎస్పీని కలిసి విలేకరులతో మాట్లాడుతూ కురుబ శ్రీనివాసులు తమ పార్టీలో చురుకైన కార్యకర్త అన్నారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా కాటిగానికాలువ సమీపంలో మధ్యాహ్నం నుంచి టిడిపి విందు ఏర్పాటు చేసుకుని ఎక్కువ మద్యం తాగడం వల్లే తమ కార్యకర్తను హత్య చేశారన్నారు.



శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి



కురుబ, బోయ కులస్తుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

వైసిపి పతనం తథ్యం..

రాష్ట్రాన్ని గాలికొదిలేసిన జగన్

అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకు

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-పెనుకొండ

జగన్ పని అయిపోయిందని, వైసిపి ప్రభుత్వ పతనం తథ్యమన్నారు. రాష్ట్రాన్ని జగన్ మోహన్ రెడ్డి గాలికి వదిలేసి అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదనే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం సోమందేపల్లి సమీపంలోని నలగొండ్రాయనపల్లి విడిది కేంద్రం నుంచి లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. విడిది కేంద్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గీయులతో ఆయన భేటి అయ్యారు. సోమందేపల్లి దళితవాడలో ఎస్సీ వర్గీయులతో అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో చేనేతలతో సమావేశం నిర్వహించారు. పెనుకొండ మండలం వెంకటాపురం తండాలో స్థానికులతో, పెనుకొండలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఆర్చి వద్ద స్థానికులతో మాటామంతీ చేపట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలు మైనార్టీ సోదరులు, ప్రజలు పెద్ద ఎత్తున నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను లోకేష్‌కు అందజేశారు. అనంతరం ఎన్‌గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో వ్యాపారులతో సమావేశం జరిగింది. కురుబ సామాజిక వర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. కరోనా కంటే డేంజరస్ వైరస్ జగన్ అని, ఈ వైరస్‌కు వ్యాక్సిన్ చంద్రబాబు నాయుడే అని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి రావడం లేదన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రాన్ని జగన్ మోహన్‌రెడ్డి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలనూ పెంచేసిందని అన్నారు. ఎనిమిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. వారు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూసే పరిస్థితి ఉందని అన్నారు. ఆంధ్రను గంజాయి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతూ వైసిపి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఇసుకను దోచేస్తూ రోజుకు రూ.కోట్లు అర్జిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ నిధులు అందజేస్తామని చెప్పారు. సమాజంలో వ్యాపారులు కూడా భాగ్యస్వాములని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల విషయంలో బిసిలకు అన్యాయం

సిఎం జగన్ బీసీలకు తీరని అన్యాయం చేశారని లోకేష్ అన్నారు. రిజర్వేషన్ల విషయంలో వారికి తీరని అన్యాయం జరిగిందన్నారు. బుధవారం పెనుకొండలో కురుబ, బోయ కులస్తుల ఆత్మీయ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి హయాంలోనే బిసిలకు న్యాయం జరిగిందన్నారు. బిసిలను చట్టసభలకు పంపించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. వారిని మంత్రులను చేసిన ఘనత కూడా టిడిపిదే అన్నారు. టిడిపిలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. పేద ప్రజలను సిఎం జగన్ వెంటాడి వెంటాడి పీడిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాడు వేస్తున్నాడన్నారు. నాడు చంద్రబాబు వాల్మీకుల రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. ఆ తీర్మానానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. ఎస్టీ సోదరులకు ఇబ్బందులు లేకుండా వాల్మీకులకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. కురుబలకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులను కేటాయించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందరూ ఐక్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, మాజీ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పూల నాగరాజు, మాజీ అహుడా ఛైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కురుబ కృష్ణమూర్తి, కురుబ, వాల్మీకి సాధికార కమిటీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కురుబ, వాల్మీకి కులస్తులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'లో మహిళల పాత్ర కీలకం

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణాన్ని పరిశుభ్రముగా ఉంచడంలో మహిళల పాత్ర కీలకమైందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. స్వచ్ఛ ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. వినాయక కూడలి వరకు సాగిన ర్యాలీ అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ మూడు రకాల డస్ట్‌బిన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటిలో తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధ్యక్షులు పోరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీలక్ష్మి, డిష్ గోవిందా, శారద, వైసిపి నాయకులు పోరాళు శివ, శ్రీరామిరెడ్డి, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, సచివాలయ పారిశుధ్య సిబ్బంది, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

వైద్యరంగంలో ప్రమాణాలు పెరగాలి

డాక్టర్ జయప్రకాష్ నారాయణ

ఘనంగా వైద్య విద్య పట్టాల కార్యక్రమం

ప్రజాశక్తి అనంతపురం

వైద్యరంగంలో ప్రమాణాలు పెరగాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టరు జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక మెడికల్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం వైద్య విద్యార్థుల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ హాజరాయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్య ప్రమాణాలు మెరుగుపడాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. సామాన్యులకు వైద్యం చేరువయ్యేలా ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారని దేశంలో అంత స్థాయిలో నిధులు మంజూరు లేకపోయినా ఉన్న ప్రమాణాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన వైద్యాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రయివేటు కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు పీజీ సీట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అత్యున్నత స్థాయి ప్రమాణాలతో మరింత పటిష్ట పరచాలన్నారు. వైద్యుల నియామకాలను చేపట్టి గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యం అందించే దిశలో అడుగులు పడాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను విద్యార్థుల ఆశయాలతో ముడివేసి వైద్య విద్యను పూర్తిచేసిన ప్రతి విద్యార్థికీ అభినందనలు తెలియజేశారు. 18వ స్నాతకోత్సవ కార్యక్రమంలో 93 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి డాక్టర్ దారం వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కెఎల్ సుబ్రహ్మణ్యం, మెడికల్ కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పంచాయతీ వేలంపాటలు వాయిదా

ప్రజాశక్తి-నార్పల

నార్పల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మేజర్ పంచాయతీ సర్పంచి అధ్యక్షతన బుధవారం పంచాయతీ ఆదాయ వనరులకు వేలంపాటలు నిర్వహించారు ఇందులో మూత్రశాల, మరుగుదొడ్లకు సంబంధించిన వేలం ముగిసింది. అయితే వారపుసంత, బస్టాండ్‌కు నిర్వహించిన వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే తక్కువకు పాడటం వల్ల శుక్రవారం నాటికి వాయిదా వేసినట్లు ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, వైస్‌సర్పంచు జి.శ్రీరాములు, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. బుధవారం కూడేరు మండలం జల్లిపల్లి గ్రామంలో రైతులను కలిసి చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోతలు విధించి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్మికులను వెట్టి చాకిరిలోకి నెట్టి వేసేలా, శ్రమ దోపిడి చేసుకునేలా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాలు సవరించిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను యాజమాన్యం చెప్పుచేతల్లో పెట్టుకని శ్రమను దోచుకునేలా ఉందన్నారు. కార్మికులకు స్వేచ్ఛా, హక్కుల అడిగితే గొంతు నొక్కడం, వినకపోతే ఇష్టారాజ్యంగా తొలగింపులు, వేధింపులు వంటి చర్యలను కోడ్‌లు అమలైతే పునరావృతం అవుతాయని, పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తోందని మోది ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు తేవడానికి కార్మికులు, కర్షకులు చేస్తున్న ఉద్యమాలకు రైతులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మిక(ల యూ(యన్ అధ్యక్ష(లు బి.నాగరాజు, సహాయ కార్యదర్శి ఎస్.రామాంజినేయులు, ఉపాధ్యక్ష(లు సంజప్ప, శ్రీ(వాసరెడ్డి, మహిళా విభాగం నాయక(లు రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

శింగనమల : కేంద్రంలోని ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాడన్నారు. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఈనెల 5న తలపెట్టిన చలో డిల్లీ కార్యక్రమంలో ప్రజలు, రైతుల, కర్షక, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న, రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి సూర్యప్రకాష్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శులు ఎర్రిస్వామి, ఆంజనేయులు, రైతుసంఘం మండల సహాయ కార్యదర్శి జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు లక్ష్మీనారాయణ, నాగరాజు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

గుంతకల్లు : దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ వచ్చేనెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతోందన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారం చేపట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యంగా అధికార, ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. అంతేగాకుండా బడాబాబుల కొమ్ముకాస్తూ ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జాకీర్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : మండలంలోని బొందలదిన్నె గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బెలూం సింగారం గ్రామానికి చెందిన చెందిన పామిలేటి (35) బండలలోడు ట్రాక్టర్‌కు కూలి పనులకు వెళ్లేవాడు. ఈనేపథ్యంలోనే పులివెందులకు బండల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లో డ్రైవర్ పక్కన కూర్చొని ఉండగా బొందలదిన్నె గ్రామం వద్దకు రాగానే వెనుకవైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గౌస్‌మహమ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

గుత్తి : సహకార పరపతి సంఘం అధ్యక్షుడు చిట్టెం విజయ భాస్కర్‌రెడ్డి హత్యకేసులో ఇరువురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ బుధవారం గుత్తిలోని 6వ అదనపు న్యాయస్థానం తీర్పునిచ్చింది. వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన చిట్టెం విజయభాస్కర్‌రెడ్డి వైసిపిలో కొనసాగేవారు. అంతేగాకుండా పరపతి సహకార సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపొందారు. ఆ విజయాన్ని ఓర్వలేక అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌నాయుడు, పి.గురుప్రసాద్, గుర్రం శ్రీనివాసులు ఆలియాస్ బక్క శీనా, గుర్రం సుధాకర్‌నాయుడు, గుర్రం శేషాచలపతినాయుడు అలియాస్ శేషా, గుర్రం రమణ, గుర్రం వెంకటరమణ విజయ భాస్కర్‌రెడ్డిపై కక్ష పెంచుకున్నారు. వారందరూ కలిసి విజయ భాస్కర్‌రెడ్డిని హత్య చేసేందుకు పన్నాగం పన్నారు. 2015 మార్చి 31వ తేదీన పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామంలోని పరపతి సహకార సంఘం కార్యాలయంలో విజయభాస్కర్‌రెడ్డి ఉండగా లోనికి చొరబడిన నిందితులు కర్రలతో అతని తలపై మోదారు. తీవ్రగాయాలతో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పామిడి సీఐ లక్ష్మన్న కేసును దర్యాప్తు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ధి నిందితులైన పి.గురుప్రసాద్, జి.శ్రీనివాసులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష, జి.సుధాకర్ నాయుడు, జి.శేషా ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి చొప్పున జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష, జి.రమణ, జి.వెంకటరమణకు ఒక్కొక్కరికి జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. కేసును ఏపీపీ బి.సుదర్శన్‌రెడ్డి వాదించారు.

బుక్కరాయసముద్రం బంద్ విజయవంతం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మాదిగ కడపల రమాదేవి హత్యకు నిరసనగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో నిర్వహించిన మెరుపు బంద్ విజయవంతమైంది. ఇందులో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి బంద్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ రమాదేవి హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వయానా నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఉన్నా ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరగడం బాధాకరమన్నారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సిఎం సహాయ నిధి నుంచి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. అలాగే బంద్‌కు సహకరించిన ప్రజలు, వ్యాపారులు, రవాణా, విద్యాసంస్థలు, హోటళ్ల యజమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కో కన్వీనర్ బండారు కదిరప్ప, సామ్రాట్ కేబీ.మధు మాదిగ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు సాకే హరి, అప్పా కమిటీ చిన్న ఆంజనేయులు, పూసల సంఘం హనుమంతు, జైభారత్ కుళ్లాయప్ప, నిషార అహమ్మద్, ఎంఎంఎస్ జిల్లా మహిళా నాయకులు స్వతంత్రకుమారి, రేకులకుంట వెంకటేశు, చంద్ర, నాగలింగ, సాకే చౌడప్ప, గంగయ్య, నార్పల పుల్లప్ప, రాజు, రామకృష్ణ, తదితరుల పాల్గొన్నారు.



బంద్ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపిపి దాసరి సునీత అన్నారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ, బాలికల పాఠశాలలను పరిశీలించారు. ఇందులో భాగంగా పాఠశాలలో మరుగుదొడ్లు, వంటగది, తరగతి గదులను, పరిశీలించి స్థానిక సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చామన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకంకావాలి

గుంతకల్లు : రాష్ట్రంలో నిరంకుశ, అరాచక పాలన సాగిస్తున్న వైసిపిని గద్దె దింపాలంటే ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రకు పెద్దఎత్తున ప్రజలు తరలిరావడం చూస్తే సిఎం జగన్ రెడ్డి నిరంకుశ పాలనపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో అర్థం అవుతోందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజల్ని చైతన్యం చేయడానికి ప్రతిపక్షాలు బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగ చేసుకోండి

ప్రజాశక్తి-కుందుర్పి

శ్రీరామనవమిని పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తహశీల్దార్ విజయ్‌కుమారి, ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. మండల పరిధిలోని ఎన్.వెంకటంపల్లిలో ప్రతిఏటా శ్రీరామనవమి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్వహించే రథోత్సవంలో దళితులు పాల్గొనకూడదని అగ్రవర్ణాలు హుకుం జారీ చేస్తుంటారు. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు దళితులు గత సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో బుధవారం అధికారులతోపాటు, ఎమ్మార్పీఎస్ నాయకులు గ్రామంలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శ్రీరామనవమి ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. ఘర్షణలో ప్రేరేపిస్తే ఎంతటి వారినైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గౌని ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్.రామాంజనేయులు, తాలూకా నాయకులు అనుపల్లి రామన్న, కృష్ణాపురం బాబు, గౌరవాధ్యక్షులు మారెప్ప, కుందుర్పి మండల ఉపాధ్యక్షుడు మారుతి, శెట్టూరు మండల అధ్యక్షుడు ఎటి తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు పంపిణీ

ఉరవకొండ : మండలంలోని రేణిమాకలపల్లి గ్రామంలో 60 మంది రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీతో మంజూరైన టార్పాలిన్లను సర్పంచి బోయ రామాంజనేయులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రైతుల పండించిన ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు ప్రభుత్వం టార్పాలిన్‌లను సరఫరా చేసిందన్నారు. రైతులందరూ వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అక్షిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలోని ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్ తెలిపారు. విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతుండటంతో బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించడంతో ట్రాన్స్‌ఫార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, విద్యుత్ శాఖ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

చిరుధాన్యాల సాగుతోపాటు తినడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వ్యవసాయశాఖ జిల్లా పరిశోధన కేంద్రం ఎడిఎ శైలజ సూచించారు. బుధవారం మండలంలోని చిన్నవడుగూరులోని గ్రామ సచివాలయంలో చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు అనేక జబ్బులకు గురవుతున్నారన్నారు. ఈతరుణంలో చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన కొర్ర, తదితర పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణారెడ్డి, ఎఒలు రుమానాబేగమ్, శ్రీనివాసులు, శంకర్‌లాల్‌నాయక్, వ్యవసాయ విస్తరణాధికారులు సునీత, రజనీ, ఆర్‌బికె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మౌర్య స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన మౌర్య స్కూల్ 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మౌర్య స్కూల్ అనాదికాలంలోనే ఎక్కువ పేరు సంపాదించుకుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న తల్లిదండ్రులకు, వారి ఆశయాల మేరకు పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, శోభారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ క్షమాపణ చెప్పి రాప్తాడులోకి అడుగుపెట్టాలి

అనంతపురం : ప్రజలు, నిరుద్యోగులను నట్టేట ముంచిన నారా లోకేష్ ముందు క్షమాపణ చెప్పి రాప్తాడు నియోజవర్గంలోని అడుగుపెట్టాలని ఎస్‌కెయు వైఎస్ఆర్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లోకేష్ ఐటి శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాప్తాడులో జాకీ పరిశ్రమ వచ్చి ఉంటే కొన్ని వేల మందికి జీవనోపాధి వచ్చేదన్నారు. కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి జాకీ పరిశ్రమ రాకుండా చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసి ఇప్పుడు దొంగయాత్రలు చేయడం బాధాకరమన్నారు. మీరు పొర్లుదండాలు పెట్టినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

'యువగళం'కు సంఘీభావం

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపటిన యువగళం పాదయాత్రకు టిడిపి బిసి సెల్ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా ఆయనతోపాటు నడిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



నారాలోకేష్‌తో టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి : ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి సూచించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా కూడేరు సిడిపిఒ ధనలక్ష్మి అధ్యక్షతన బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని ముత్యాలమ్మ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల తల్లులు, గర్భిణులు పోషక విలువలు ఉన్న పాలు, ఆకుకూరలు, కోడిగుడ్లు తీసుకోవాలని సూచించారు. మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమములో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

31న వాహనాలకు వేలంపాట

గుమ్మఘట్ట : మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన 13 వాహనాలకు ఈనెల 31న వేలంపాట నిర్వహించినట్లు ఎస్ఐ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు శుక్రవారం ఉదయం 9 గంటలకు తమ ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. అలాగే రూ.3వేలు ధరావతు చెల్లించాలని కోరారు.

కళ్యాణదుర్గం : స్థానిక రూరల్ స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 11 వాహనాలను ఈనెల 31న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ తేజామూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ 9 ద్విచక్ర వాహనాలు, 2 కార్లను స్థానిక రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు.

గుత్తి : వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలకు ఈనెల 31న వేలం వేయనున్నట్లు సీఐ ఎం.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు.

పదవ తరగతి పరీక్షలకు ఫర్నీచర్ సిద్ధం

ప్రజాశక్తి-ఉరవకొండ

వచ్చేనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఫర్నీచర్ సిద్ధం చేసినట్లు విడపనకల్ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు విజయ్‌మోహన్ తెలిపారు. బుధవారం విడపనకల్ మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఫర్నీచర్‌ను తన సొంత నిధులు వెచ్చించి ట్రాక్టర్ల ద్వారా పాఠశాలకు చేర్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీకంఠం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ వేలంపాటలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం మార్కెట్ బహిరంగ వేలంపాటలు ఉత్కంఠ నడుమ బుధవారం ముగిసింది. ఇప్పటికూ రెండుసార్లు వాయిదా పడి మూడోసారి బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన వేలంపాటలకు పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను జి.కృష్ణమూర్తి రూ.26,04,000, వారపు సంత మార్కెట్‌ను నాయకుల నాగరాజు రూ.5,88,000, జంతువధశాల, మటన్ మార్కెట్‌ను బి.పద్మావతి రూ.2,57,000కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, వేలంపాటదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తిలో రసాభాసగా..

మున్సిపాలిటీ పరిధిలో 2023-24 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ దినసరి సుంకం వసూలు హక్కు కోసం బుధవారం నిర్వహించిన వేలంపాట రసాభాసాగా సాగింది. మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో కార్యాలయంలోని సభ మందిరంలో బహిరంగ వేలంపాటకు ఏర్పాట్లు చేశారు. వేలంపాటకు 12 మంది దరఖాస్తు చేసుకోగా అందులో ఎస్.మహబూబ్‌బీ, ఎ.బాలరాజుతోపాటు మరో ఇద్దరు మున్సిపల్ గెజిట్ ప్రకారం దరఖాస్తుతోపాటు ఈసీ పత్రం ఇవ్వలేదని వారిని డిస్క్వాలిఫై చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. దీంతో మహబూబ్‌బీ, బాలరాజుకమిషనర్, మున్సిపల్ రెవెన్యూ అధికారులతో వాదనకు దిగారు. మాకు ముందే చెప్పాల్సి ఉందని, ఇప్పుడు డిస్క్వాలిఫై చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బాలరాజు మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు జోక్యం చేసుకుని బయటకు పంపారు. తర్వాత వేలంపాట ప్రారంభించగా ఎ.మమ్మద్ రఫీ రూ.18.92 లక్షలకు వేలంపాట పాడి మార్కెట్ దినసరి సుంకం వసూలు హక్కును దక్కించుకున్నారు. అలాగే జంతువధశాలకు జరిగిన వేలంపాటలో షాషావలి రూ. 27 వేలు వేలం పాట పాడి హక్కును దక్కించుకున్నారు. గత ఏడాది మార్కెట్ దినసరి సుంకం వసూల్ హక్కు కోసం రూ.18.50 లక్షలు, జంతువధశాలకు సంబంధించి రూ.25 వేలు వేలంపాట జరిగిందని అధికారులు తెలిపారు.

యాడికి : జంతువధశాల, దిన మార్కెట్‌కు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఇందులో 13 మంది పాటదారులు పాల్గొనగా దిన మార్కెట్‌ను రంగనాయకులు అనే వ్యక్తి రూ.4.7లక్షలకు, జంతువధశాలను పాడి రంగప్ప అనే వ్యక్తి రూ.41 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇఒ ఎర్రిస్వామి, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, సర్పంచి పందు అనురాధ, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్, ఎంపిటిసిలు వెంకటనాయుడు, తిరుపతి, నాగరాజు, రామ్మోహన్, కోటి చిన్న వెంకటరాముడు, ప్రజలు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగిద్దాం

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



గుత్తిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విశ్వవిఖ్యాత నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. బుధవారం నగరంలోని టిడిపి అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారని గుర్తు చేశారు. తొలుత ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కూచిహరి, మాజీ కార్పొరేటర్ రాజారావు, డాక్టర్ లక్ష్మీప్రసాద్, లాయర్ శ్రీధర్, బంగినాగ, టిడిపి నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, కార్యదర్శి జానకి, రాష్ట్ర నాయకురాలు స్వప్న, తేజస్విని, బాలప్ప, రాయల్ రఘు, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, దేవి, శంకరమ్మ, కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎన్టీ రామారావు ఆశయాలు కొనసాగిస్తామని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దేవినేని పురుషోత్తం తెలిపారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ సర్పంచులు వెంకటేశులు, రవికుమార్, మాజీ ఎంపిపి సుంకరత్నమ్మ, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ ఎంపిటిసి చంద్రశేఖర్, వార్డుమెంబర్ రామాంజనేయులు, నాయకులు నర్రా కేశన్న, మోపిడి గోవిందు, రాజగోపాల్, సుధాకర్, రామకృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

నార్పల : మండలం కేంద్రంలో బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, మైనారిటీ జిల్లా కార్యదర్శి జాఫర్‌వలి, క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ, తెలుగు యువత చంద్రబాబు, సత్తి, ఆలం శీను, డీలర్ శివారెడ్డి, పెద్దిరెడ్డి, నిమ్మకాయల రామంజి, నరేంద్ర, కొండయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సల్, సోమశేఖర్ నాయుడు, చంద్రమౌళి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దాసరి రాము, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహంచారు. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ యాదవ్, తలారి ఆదినారాయణ, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల్ చంద్రమోహన్, శింగనమల పెద్ద నాగముని, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలక కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండలం కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు మనోరంజని, వెంకటనారాయణ, సూర్యనారాయణ, అనుమప్పచౌదరి, సీనియర్ నాయకుడు ఎస్సీ మల్లన్న, జిల్లా అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, ఆనంద్, ఎస్టీ సెల్ వెంకటేశులు, ఎస్సీ సెల్ ఓబులేసు, రైతు సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత దివంగత నేత నందమూరి తారక రామారావు స్థాపించిన టిడిపికే దక్కుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక టీ సర్కిల్ సమీపంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాధాకృష్ణ, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున, పెద్దతిప్పయ్య, టిడిపి వైస్ ఎంపీపీ తిమ్మప్ప, మాజీ ఎంపిటిసి కంచి రాముడు, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, నరిగన్న, శశిభూషణ్, నక్కలపల్లి వెంకట్రామిరెడ్డి, బాలాజీ, ఆదిమూర్తి, దేవప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : స్థానిక బస్టాండ్‌లోని ఎన్టీఆర్ సర్కిల్‌లో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, మాజీ సర్పంచి గోపాల్‌నాయుడు, పరిమి చరణ్, బొట్టుశేఖర్, మధురాజు, నాగ మునిరెడ్డి, కోడూరు నీలకంఠారెడ్డి, తాంద్ర విక్రమ్, తదితరులు పాల్గొన్నారు

బుక్కరాయసముద్రం : తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాపింపజేసిన ఘనత టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు దక్కుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. టిడిపి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్వగ్రామం సిద్ధరాంపురంలో కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం గుత్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టిడిపి సీనియర్ నాయకులు హరినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో కొజ్జేపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు వీరాంజనేయులు, శివుడు, ఎల్లప్ప, సంజప్ప, శ్రీనివాసులు టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి పి.శ్రీకాంత్ చౌదరి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దిల్కా శీనా, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి జిలాన్, మాజీ ఎంపీపీ వీరేష్, మాజీ మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కె.గోవిందు, నాయకులు మహ్మద్ అలీ, రామకష్ణ గౌడ్, కోనా లక్ష్మణరావు,పెద్ద శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న శ్రావణిశ్రీ

ఎఎన్ఎంలకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలి

అనంతపురం కలెక్టరేట్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఎఎన్ఎంలకు ముఖ ఆధారిత హాజరుతో ఇబ్బందులు ఎదురౌతున్నాయని, ఆన్ డూటీ సౌకర్యం కల్పించాలని ఎపి ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మాధవరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సిఇఓ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు ముఖ ఆధారిత హాజరును వేయడానికి ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో టీకాల కార్యక్రమానికి వారు వెళ్ళినప్పుడు, సంబంధిత ఆరోగ్య కేంద్రానికి సెక్టార్ మీటింగ్, ఆశా డే, గర్భవతుల పరీక్షలకు కానీ వెళ్ళినప్పుడు వారికి ముఖ ఆధారిత హాజరు నందు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించి, వారు ఆన్ డ్యూటీ వేసినప్పుడు అప్రూవ్ చేసే విధంగా సంబంధిత సచివాలయ డిడిఓ లకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని సిఇఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ రెడ్డి, శ్రీధర్ బాబు, గుత్తి తాలూకా అధ్యక్షులు శ్రీనివాసులు, సింగనమల తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు, సిహెచ్ అసోసియేషన్ నాయకులు లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

ముఖ్యమంత్రి జగనన్న వెంటనే మహిళలందరూ ఉన్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు మెగా చెక్కు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఖాతాల్లో నగదు వేస్తున్న సిఎం జగనన్నను అందరూ మెచ్చుకుంటుంటే ప్రతిపక్షనేతలు మాత్రం శాపనార్థాలు పెడుతున్నాయని విమర్శించారు. పేదవాళ్లు గొప్పవాళ్లవుతుంటే చాలామందికి నచ్చడం లేదన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు దాటినా పేదవాడు ఎప్పుడూ పేదవాడుగానే ఉండిపోతున్నాడన్నారు. ఈనేపథ్యంలో పేదలకు చేయూతనిచ్చే నవరత్న పథకాలను సృష్టించి, వారి జీవన చిత్రాన్ని మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. విజ్ఞులైన ప్రజలందరూ గమనించాలన్నారు. మండలంలో 630 గ్రూపులకు 6387 మంది సభ్యులకు రూ.5.38 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, జడ్పీటీసీ కంచిరెడ్డి సుధారెడ్డి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఓ నిర్మలాకుమారి, ఎటిఎం నారాయణస్వామి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్ , ఎంపిటిసి మొరార్జీ, నాయకులు పరంధామరెడ్డి, ఎన్‌వి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

'ఆసరా'లో ఎమ్మెల్యేలు

అనంతపురం : వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలను తీసుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న విద్యుత్ కళాభారతి ఫంక్షన్ హాల్‌లో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితుల కారణంగా చదువుకు ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద రూ.25 కోట్ల 60 లక్షలు అందిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ చేయూత కింద ఏటా రూ.18750 ఆర్థికసాయం చేస్తున్నామని తెలిపారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు చంద్రలేఖ, లీలావతి, సైపుల్లాబేగ్, మెప్మా పీడీ విజయలక్ష్మి, నగర పాలక సంస్థ సెక్రటరీ సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు లావణ్య, ముంతాజ్‌బేగం, మీనాక్షి, రామాంజినమ్మ, నరసింహులు, అబూసాలెహ్, రామాంజనేయులు, కమల్‌భూషణ్, కో ఆప్షన్ సభ్యురాలు ఉమామహేశ్వరి, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కష్ణవేణి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : సిఎం జగన్ ఆసరా పథకాన్ని తీసుకొచ్చి అక్కచెల్లెమ్మలకు భరోసా కల్పించారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఆసరా సంబరాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న ఎఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు పంపిణీ చేశారు. తొలుత సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు, కమషనర్ జబ్బార్‌మియా, ఎంపిడిఓ రంగారావు, ఎపిఎం రాజశేఖర్, సిఎంఎం తులసి, టీపీఆర్డీ సతీష్, ఎంపిపి సరస్వతి, జడ్పీటీసీ రమణమ్మ, ఏరియా కో ఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, సీసీలు మహబూబ్‌బాషా, మల్లిఖార్జున, అరుణమ్మ, మధుసూదన్‌రెడ్డి, మండల సమైఖ్య సిబ్బంది, ఓబీ మెంబర్లు, ఎమ్మెస్ సుజాత, యానిమేటర్లు, ఆర్‌పిలు, డ్వాక్రా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత



తాడిపత్రిలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి